# రాస్ - కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి

వనస్థలి, కరకంబాడి పోస్ట్, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్-517 520

ఫోన్: 8639851546, 7981070420

e-mail: rasskvk@gmail.com, website:kvkchittoor.org


## మల్బరీని ఆశించే పురుగులు - నివారణ

రాస్-కృషి విజ్ఞాన కేంద్రము తిరుపతి వారి క్షేత్ర సందర్శనలో మల్బరీ తోటలలో తరచుగా గమనించిన ప్రధాన పురుగులు ఆశించిన తర్వాత లక్షణాలు అనుగుణంగా, రైతులకు పురుగులపై అవగాహనా మరియు ఆకు దిగుబడి తగ్గకుండా ఉండేందుకు తీసుకొనవలసిన నియంత్రణా పద్ధతులను క్రింది తెలియజేయడం జరిగింది. రైతులు ఈ విధానాలను పాటించి అధిక దిగుబడులు పొందగలరని ఆశిస్తూ.....

### ఆకు ముడత రోగము (తుక్రా)



ఆకు ముడత మ్యాకోనెల్లికోకస్ హిర్సుటస్ అనే పిండి నల్లి పురుగు ద్వారా సంక్రమిస్తుంది. ఈ వ్యాధి తీవ్రత వేసవి కాలంలో ఎక్కువగా ఉంటుంది. దీని వలన మొక్కల చివరి భాగాలు ముదురు ఆకుపచ్చ రంగులోకి మారి కుచించుకుపోయి ముడతలు పడి జిగటగా ఉంటాయి. దీనినే తుక్రా అంటారు. దీని వలన 10-30% వరకు పంట నష్టము కలుగుతుంది.

### నివారణ పద్ధతులు

- వ్యాధికి గురైన కొమ్మలను మొక్కల నుండి వేరు చేసి వెంటనే కాల్చివేయాలి.
- వేపనూనె 5.0 మి.లీ/ లీటరు నీటికి కలిపిన ద్రావణమును మొక్కలపై పిచికారి చేయాలి.
- రసాయనిక క్రిమిసంహారియైన డైమిథోయేట్ 2.0 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.
- జీవ నియంత్రణ కారకమైన "క్రిప్టోమస్ మాంట్రోజరి" అనే కీటకములను ఎకరానికి 250 చొప్పున రెండు విడతలలో అక్టోబర్-నవంబర్ మరియు జనవరి-ఫిబ్రవరి నెలలలో విడుదల చేయాలి.

## ఆకు చుట్టు పురుగు (లీఫ్ రోలర్ లేదా లీఫ్ వెబ్బర్)



డయఫినియా పల్వేరులెంటాలిస్ అను కీటకము మల్బరీ పంటను ఆశించి నష్టం కలుగజేస్తుంది. ఈ వ్యాధి ఆగష్టు మాసంలో ప్రారంభమై చలి కాలంలో తీవ్రంగా ఉంటుంది. ఈ వ్యాధి వలన ఆకుల అంచు భాగాలు చుట్టినట్టుగా గాను లేదా దగ్గరకు చేరి కుచ్చు వేసినట్టుగా గాని ఉంటాయి. ఈ కీటకములు అత్యధికంగా ఆకులను తినడం వలన 30% వరకు పంట నష్టము కలుగును.

### నివారణ పద్ధతులు

- వ్యాధి సోకిన మొక్క భాగాలను కత్తిరించి కాల్చివేయాలి.
- రసాయనిక క్రిమిసంహారియైన డైమితోయేట్‌ని 2.0 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.
- ఇంటర్ ప్రిడ్ (క్లోర్ ఫెనాఫర్) 1.5 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సురక్షిత కాలము 20 రోజుల తరువాత మాత్రమే మల్బరీ ఆకును పురుగులకు మేతగా వినియోగించాలి.
- వేపనూనె 5 మి.లీ/ లీటరు నీటికి కలిపిన ద్రావణమును మొక్కలపై పిచికారి చేయాలి. చేసిన 7 రోజుల తరువాత ప్రతి ఎకరాకు నాలుగు "ట్రైకోగ్రామా ఖీలోనిస్" గ్రుడ్ల కార్డులను వారానికి ఒకటి చొప్పున కట్టాలి. జీవ నియంత్రణా కీటకాలను వదిలిన తరువాత కీటకనాశిని మందులను పిచికారి చేయకూడదు.

## గొంగలి పురుగులు

స్పైలోసోమ ఓల్లికా అనే కీటకము యొక్క లార్వా (గొంగళి పురుగు) లు పంటను ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. ఈ పురుగు ఆగష్టు నుండి ఫిబ్రవరి వరకు తీవ్రంగా ఉంటుంది. దీని లార్వాలు ఆకుల మీద గుంపులుగా చేరి ఆకులను పూర్తిగా తినివేయడం వలన మొక్క, ఆకులు లేని కొమ్మలుగా కనిపించును. ఈ పురుగులు వలన పంటకు 30% వరకు నష్టము కలుగును.

### నివారణ పద్ధతులు



- ఈ కీటకము గుడ్ల సముదాయమును ఆకు యొక్క క్రింది భాగంలో పెడుతుంది. అందువల్ల ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న కాలంలో మల్బరీ తోటలను జాగ్రత్తగా గమనించి గుడ్ల సముదాయము ఉన్న ఆకులను సేకరించి కాల్చివేయాలి.
- పురుగుల వ్యాప్తిని ఒక చోట నుండి మరి యొక చోటకి వ్యాపించకుండా తోట చుట్టూ కందకాన్ని తవ్వాలి.
- 250 మి.లీ.ల నువాక్రాన్‌ను మూడు లీటర్ల నీటిలో కలిపి, దీనిలో కరిగించిన రెండు కిలోల బెల్లము మరియు 20 కిలోల రంపపు పొట్టును కలిపిన మిశ్రమాన్ని (విషపు ఎరలు) తోటలో ఉంచాలి.
- రసాయనిక క్రిమిసంహారియైన డైమితోయేట్ 2.0 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

### తామర పురుగులు (త్రిప్స్)



వీటిని సూడో డెండ్రోత్రిప్స్ అంటారు. పురుగులు సంవత్సరము పొడవునా కనిపించినప్పటికి వేసవిలో తీవ్రత ఎక్కువగా ఉండి, పంటకు 5% వరకు నష్టము కలిగించును. ఈ కీటకాలు లేత ఆకుల రసాన్ని పీల్చి పంటకు నష్టము కలిగించును. ఈ కీటకము వలన మల్బరీ ఆకులు తొందరగా ముదిరి తక్కువ పోషకాలు మరియు తేమను కలిగి ఉంటాయి. ఈ ఆకులను పట్టు పురుగులకు మేతగా ఇవ్వడం వల్ల పట్టుగూళ్ళ నాణ్యత మరియు దిగుబడి తగ్గుతుంది.

### నివారణ పద్ధతులు

తుంపర సేద్యాన్ని వాడటం, డైమితోయేట్ 2 మి.లీ.ను లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. పిచికారి చేసిన 20 రోజుల తర్వాత ఆకును పట్టు పురుగులకు మేతగా ఉపయోగించవచ్చు.

## తెల్లదోమ



మార్చి–జూన్ మరియు అక్టోబర్–డిసెంబర్ మధ్య కాలంలో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తెల్లదోమలు ఆకులలోని రసములను పీల్చివేసి నాణ్యతను దెబ్బ తీస్తాయి.ఢింభకాలు మరియు ప్రౌఢ పురుగులు ఆకుల క్రింది భాగంలో చేరి రసమును పీల్చివేయుట వలన దెబ్బతిన్న ఆకులు పట్టు పురుగుల పెంపకమునకు పనికి రావు.

### నివారణ పద్ధతులు

- చీడ సోకిన ఆకులను, కొమ్మలను సేకరించి కాల్చివేయాలి.
- సిఫారసు చేయబడిన స్థలావకాశము మరియు ఎరువుల వాడకాన్ని పాటించాలి.
- తోటలోను, పరిసరాల్లోను కలుపు మొక్కలను తొలగించాలి.
- వేపనూనె 5.0 మి.లీ లీటరు నీటికి కలిపిన ద్రావణమును మొక్కలపై పిచికారి చేయాలి.
- రసాయనిక క్రిమిసంహారియైన డైమితోయేట్ 2.0 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

## లద్దె పురుగులు (కట్ వర్మ్) – స్పోడాప్టెరా లిట్యూరా



ఈ కీటకాలు అక్టోబర్–ఫిబ్రవరి మద్యకాలంలో ఎక్కువగా ఆశిస్తాయి. ఈ పురుగులు లేత కొమ్మలను కత్తిరించివేస్తాయి. మల్బరీ ఆకులను కూడా ఎక్కువగా తింటాయి.

### నివారణ పద్ధతులు

- ఈ కీటకపు గ్రుడ్లను, లార్వాలను సేకరించి, చంపివేయాలి.
- ఈ కీటకాల బారిన పడ్డ మల్బరీ మొక్క చుట్టు వున్న మట్టిని భాగా త్రవ్వి సూర్యరశ్మితాకిడికి గురి చేయాలి.
- ఆకు వినియోగించుకున్న తరువాత, లేదా కొమ్మలను కత్తిరించిన తరువాత మల్బరీ మొక్కల మొదల్ల వద్ద 5% మిలాథియాన్ పొడిని చల్లాలి.

**గమనిక:** క్రిమిసంహారక మందులు పిచికారి చేసిన 20 రోజుల తర్వాత తరువాత ఆకును పట్టు పురుగులకు మేతగా ఉపయోగించాలి.

ఎ. పద్మజ
పట్టు విభాగ శాస్త్రవేత్త

డా.ఎస్. శ్రీనివాసులు
ప్రధాన శాస్త్రవేత్త మరియు హెడ్